ఉదర నిమిత్తం

మధ్యాహ్నము సరిగా 12 గంటల సమయము. ఉమాసుందరి పెనిమిటిని ఆఫీసుకు పంపి చిన్న చిన్న పనులు చక్క పెట్టుకుంటున్నది. గదిలో బట్టలన్నీ చిందరవందరగా పారవేసే అలవాటు వెంకట్రావుకు. తన కెన్ని అందిచ్చినా, ఎంత సరిపెట్టినా, ఆ గది రెండుపూటలూ తిరిగి సర్దవలసిందే. ఇవన్నీ సర్దుకొని ఉమా సుందరి భోజనానికి ఏర్పాట్లు చేసుకుంటున్నది. పళ్లెం పెట్టుకొని పీట వేసుకుంటుం డగా 'గోవిందా' అన్నమాట వినబడింది. తానుతప్ప ఎవరూలేని ఆయింట్లో మారుమనిషిమాట వినబడేసరికి ఉమాసుందరి ఉలిక్కిపడింది. జుట్టు విరబోసుకొని, పట్టెనామాలతో - కాషాయవస్త్రాలతో - నల్లటి ఆజానుబాహువు, చేతిలో పళ్లెము దాంట్లో తిరుపతి పట్టెనామాల చెంబు పెట్టుకొని-నిల్చున్నాడు గడపకు ఎదురుగా, ఉమాసుందరి కెవ్వున కేకవేసి గోడ నానుకొనిపోయింది. ఆ కేకతో క్రింద చెట్ల దగ్గర కూర్చున్న బోయవాడు వచ్చాడు సంగతేమిటో కనుక్కుందామని.

"నాకు వేంకటరమణుడు కలలోకి వచ్చి, మీ ఇంటివైపు చూపించి. ఇక్కడినుంచి ఆరగింపు, తేరుగట్టటానికి ధోవతి, కర్పూరము వెలిగించటానికి-డబ్బులు తీసుకురమ్మన్నాడు. వేంకటేశ్వర్లు ఆజ్ఞ ఇచ్చాడు. తీసుకురా" అంటున్నాడు అధికారంతో.

సుందరి నిర్ఘాంతపోయింది. తమ దగ్గర్నుంచి ఆరగింపా వేంకటేశ్వర్లకు! ఎట్లా ? ఇంట్లో ఆరాత్రికి బియ్యము లేవు. అక్కడికి ఆ పూటకే బదులు వ్యవహార మయింది. తాను వడ్డించుకున్న అన్నము తప్ప ఇంక ఒక్క మెతుకయినా లేదు. తాను వడ్డించుకొన్నదయినా తనకు తప్ప మరొకరికి పనికిరాదు ; వెంకట్రావు భోజ నము చేసిన పళ్లెములో తినే అలవాటు తనకు, ఈ యోచనతో సుందరి, అలాగే, గోడనానుకొనే చూస్తున్నది.

"ఏమి ! ఆలోచిస్తున్నావా ? వేంకటరమణునికి ఆరగింపుచేయవూ ?" అంటూ చెయ్యి విసిరాడు దగ్గరికి రమ్మని. భయపడుతూ సుందరి రెండడుగులు ముందరికి

వేసింది. చేతిలో ఇంత విభూతి నలిచి వేస్తూ, "ముఖానికి పెట్టుకో. ఆలోచిస్తావా, వేంకటేశ్వర్లకు కోపము వస్తుంది. తీసుకురా" అని ఆజ్ఞాపించాడు. సుందరి గజ-గజ వణుకుతూ అతని ముఖము చూసింది. చెంపకు ఇటువైపునుంచి పొడుచుకొన్న ఇనుపచువ్వ అటువైపుకు వచ్చింది। భయంకరంగా ఉంది దృశ్యము. ఇవ్వకపోతే ఏంచేస్తాడో। ఇస్తే నిష్కారణంగా తాను పస్తుపడుకోవాలి। వెంటనే తిరిగి, బోయివంక చూస్తే వాడు సాష్టాంగపడ్డాడు ఈ వేంకటేశ్వర్లముందర।. ఏమీ తోచనిస్థితిలో ఆ పళ్లెము తెచ్చి ముందర పెట్టింది. ఇత్తడి పళ్లెములో అన్నముపెట్టి ఇవ్వాలని మనసులో ఉంది. కాని ఇంతలోకి పళ్లెం మారిస్తే ఏం చేస్తాడోనన్న భయమువేసింది.

"తేరు కట్టటానికి ధోవతి తీసుకురా, పట్టుది-జరీ అంచులది. వెంకటేశ్వర్ల అనుగ్రహం పొందుతావు. యోచన చేయకు." ఆజ్ఞాపిస్తున్నాడు.

కాలు కదపటానికి సుందరికి ధైర్యములేదు; అసలు సాగటం లేదు. గజ-గజ వణికిపోతోంది. వెనుకకు నడుచుకుంటూపోయి, తన పెండ్లిలో పెట్టిన జరీ అంచుల ధోవతి-వెంకట్రావుది-తెచ్చి యిచ్చింది.

"ఊఁ కర్పూరం వెలిగించటానికి డబ్బులు"

కొంగుకు ముడి వేసుకొన్న అయిదు రూపాయలు ఇచ్చేసింది, కొంత అట్టిపెట్టుకునే ధైర్యం లేక.

"ఇస్తున్నావు గాని నీ మనసు ధరించటము లేదు. జ్ఞాపకము చేసుకో వెంకటేశ్వర్లను. 'గోవిందా' అనండి" అంటూ మెట్లు దిగి సాగిపోయాడు.

అసలు సుందరికి నెలదినాల నుంచి ఆరోగ్యము సరిగాలేదు. ఏమిటో నలతగా ఉంటున్నది. అందులో రేషనింగు భోజనము సరిపడటము లేదు. ఆ భయానక సంఘటనకు పాపమామె ఒళ్లు తిరిగి పడిపోయింది. సాయంకాలము నాలుగు గంటలకు వెంకట్రావు వచ్చేసరికి వంట యింట్లో ఎక్కడి సామాన్లు అక్కడే పడి ఉన్నాయి. సుందరి పెద్ద జ్వరముతో ఒళ్లు తెలియకుండా పడి ఉంది. పిలిచినా పలికే స్థితిలో లేదు. బోయిని పిలిచి, "ఏమిటి ఇదంతా" అని అడిగాడు. వాడు చెప్పినది వింటుంటే, ఎంతో సేపటికి గాని వెంకట్రావుకు విషయము తలకెక్క

లేదు. హోటలు నుంచి వేడి వేడి కాఫీ తెప్పించి త్రాగించి కూర్చోపెట్టాడు సుందరిని.

"ఏమిటి సంగతి, ఏమి జరిగింది?" అని అడిగాడు.

మళ్ళీ చెమటలు పోశాయి సుందరికి. ఉదయము జరిగిన సంఘటన తిరిగి కళ్ళకు కట్టినట్లయింది. కెవ్వున కేక వేసింది. ఈసారి సుందరి ముఖము చూసి వెంకట్రావుకు భయము తోచింది. చెమటలు తుడుస్తూ అడిగాడు. "వాకిట్లో ఎవరు వచ్చేది చూడకుండా బోయవాడు ఏం చేస్తున్నాడు? ఆ వచ్చినవాడిని చూసి భయ పడ్డావా?"

"అసలు వాడిని చూడగానే నా ప్రాణాలు పైకి ఎగిరి పోయాయి. దబా యించి బెదిరిస్తూ, నిలబెట్టి. అన్నీ తీసుకున్నాడు." మాటతడబడుతూ చెప్పసాగింది.

"అయితే ఏమేమి ఇచ్చావు?"

"మీరు భోజనము చేసే పళ్ళెము, మీ పెళ్ళినాటి సేలము ధోవతి నా చేత బలవంతంగా ఇప్పించుకున్నాడు. అదేమిటో ఇనుపపుల్ల ఒకటి చెంపమీద అటు నుంచి ఇటు వచ్చేలా పొడుచుకున్నాడు. దాన్ని చూసేసరికి నాకు భయం వేసింది. 'తీసుకురా, తీసుకురా' అన్న గద్దింపులతో అన్నీ వసూలు చేశాడు. నల్లటిముఖము మీద పంగనామాలు- భయంకరమైన ఎర్రని కళ్లు అబ్బా!" అంటూ కళ్లు రెండు మూసుకుంది.

బోయి తలవాచేటట్లు చివాట్లు తిన్నాడు. "నీవూ వాడు కలసి ముందర మాట్లాడుకున్నారా ఏమిటి? లేకపోతే ఇంత కథ నడుస్తుంటే చూస్తూ ఊరుకున్నావా? విన్ను పోలీసులకు పట్టిస్తే సంగతంతా బయటపడుతుంది" అన్నాడు వెంకట్రావు

"దొరా, నన్ను ఏం చేసినాసరే. నేను సిద్ధంగా ఉన్నాను. కాని ఆ సమ యంలో-నేను కాదు-మీరయినా అపని చేస్తారు. వాడిమహిమ! 'వెంకటరమణా, గోవిందా' అనగానే ఏమి తోచదు. చేతులు రెండూ వాటంతట అవే కలుసు కుంటాయి" అన్నాడు.

"నీవు ప్రతివాడిని లోపలికి ఎందుకు రానిస్తావు? ముందు ఈ మాటకు జవాబు చెప్పు" అన్నాడు వెంకట్రావు

"అమ్మగారితో వెంకట రమణ యిచ్చిన ఆదేశము చెప్తానన్నాడు. 'నన్నడ్డు పెట్టావా' అని కళ్లు తెరిచాడు. నేనేం చేసేది? నాకు అక్కడికే కాళ్లు వణికి పోయాయి" అన్నాడు, చేతులు నులుపుకుంటూ.

"సరేలే నీ కవిత్వము బాగుంది" అంటూ వెంకట్రావు గొణిగాడు.

*   *   *   *

ఆ రోజు శుక్రవారము. వెంకట్రావు ఉదయము కాఫీ త్రాగి బజారుకు బయలు దేరాడు. ఇద్దరు స్నేహితులు తోవలో కలసి మాట్లాడుతూ, ఫలహారశాల దగ్గరకు తీసుకువెళ్ళారు. అక్కడ చౌరస్తా మీద నిలబడి మాట్లాడుతూ, ఒక గంట కాలం గడిపి హోటల్లో ఫలహారము చేశారు. వాళ్ళను అటునుంచి పంపి, తాను ఇంటికి వస్తుండగా, ఒక బైరాగి 'మహారాజ్' అని పిలచాడు 'ఏమిటి' వెనుకకు తిరిగి చూశాడు వెంకట్రావు భవిష్యంలో జరుగబోయే ఒకటి రెండు శుభాలు చెప్పి "మహారాజ్ ఒక గురిగింజకు రెండు గింజల ఎత్తు బంగారము చేయగల విద్య నాకు వచ్చు. పరీక్ష చేస్తారా? కొంచెము ఇస్తే మహిమ చూపిస్తాను. మీది మీరు తీసుకుందురుగాని" అన్నాడు. ఏ ధ్యాసలో ఉన్నాడో వెంకట్రావు తన వేలి ఉంగరము తీసి యిచ్చాడు. అక్కడే- పెద్దరోడ్డుకు ఆనుకొని ఉన్న కాలిబాట మీదనే- తన జోలెలో ఉన్న చిన్న కుంపటి తీసి మంట పెట్టాడు. ఆ మంటలో ఉంగరం వేసి ఏదో పొడి చల్లాడు. దానితో అపరిమితమయిన పొగ లేచి ఒకరి కొకరు కనబడకుండా అయిదు నిముషాల పాటు గడిచింది. కళ్ళు మూసుకుంటూ తెరుచుకుంటూ పొగ ఉధృతము తగ్గిన తరువాత వెంకట్రావు చూస్తే ఏముం దక్కడ? పొగతో పాటు బైరాగి కూడా వెళ్ళి ఉంగరముతో మాయమైనాడు.

తన యింట్లో జరిగిన దానికే బుద్ధిమాంద్యము వల్ల ప్రాపంచక జ్ఞానము లేకపోవటం వల్ల అంతపని జరిగిందని అనుకున్నాడు! కాని తానెందుకు భ్రమిం చాడు? సరిగా నెల కాలేదు. ఇంతలో రెండు మోసపు సంఘటనలకు తన సంసా రము గురి అయింది!

కొన్నాళ్ళ తరువాత వెంకట్రావు క్లబ్బులో స్నేహితులతో మాట్లాడుతూ కూర్చున్నాడు ఒక ఎర్ర సైకిలు వచ్చి ఆగింది గేటు దగ్గర. 'శ్రీధరరావు వకీలు, టెలిగ్రాము' అంటూ వచ్చినవాడు ఒక కవరు ఇచ్చాడు వెంకట్రావు ప్రక్కన కూర్చున్న సభ్యుడు 'నేనే' అంటూ లేచి వెళ్ళి అందుకున్నాడు. టెలిగ్రాము వచ్చిందనగానే మంచి చెడ్డలు తెలుసుకోవాలని అందరూ అతని చుట్టూ మూగారు. "ఏమీ లేదండీ మా వాళ్లు పుట్టింటి నుంచి వస్తున్నామని టెలిగ్రాము యిచ్చారు" అని చాలా సామాన్యమైన విషయముగా జవాబిచ్చాడు. తిరిగి ఎవరి ఆటలలో వాళ్ళు నిమగ్నులయారు.

“రెండు నెలల నుంచి ఇక్కడ లేని వాళ్ళు వస్తామని టెలిగ్రాము యిస్తే దిగులుగాచూస్తావెందుకయ్యా సంతోషపడక” అంటూ చనువుగామెలిగే స్నేహితు డొకాయన పలికించి అడగటము ప్రారంభించేసరికి శ్రీధరరావుకు నిజంగా బిక్క ముఖము పడింది. ఒకరి తరువాత ఒకరు అందరూ, ఆయన వంకకే తిరిగి వేధించటము మొదలుపెట్టారు. ఇక గెలువజాలక “ఉన్నదేమిటో చెప్తా”నంటూ ఒక బల్లమీద కూర్చున్నాడు. ఆ మాటలు వినటానికి అందరు చెవులు దోరగిల పెట్టుకొని కూర్చున్నారు.

“చూడండి, మొన్న మధ్యాహ్నం నేను నా గదిలో పడుకొని ఉండగా తలుపు నెట్టిన చప్పుడు వినబడింది. ఆ కలత నిద్రలో మా పెద్ద అబ్బాయేమో అనుకుని ‘తలుపు వెయ్యరా’ అని అటు ఒత్తిగిలి పడుకున్నాను. ‘అంబ! కాళి! వచ్చిం’దని ఒక కేక వినపడ్డది కళ్లు తెరచి చూతును గదా, ముఖానికి రూపాయంత బొట్టుపెట్టుకొని, చేతిలో త్రిశూలము పట్టుకొని కాషాయ వస్త్రాలతో-నల్లటి మనిషి-ఎర్రటి కళ్ళతో ఒక ఆడది ఎదురుగా వచ్చి నిలబడింది. నేను కలతనిద్రలో లేచాను కనుక- ఈ దృశ్యము కనడగానే నిద్రావస్థ అయినదీ, జాగ్రదవస్థ అయినదీ తెలుసుకోలేకి చెయ్యిమీద గిల్లి చూసుకున్నాను. ఇక చూడండి; ముత్తైదువకు బొట్టుపెట్టి తాంబూలమియ్యమని ఆజ్ఞాపించి, నాకెటు తోచకుండా చేసి, చివరకు మా ఆవిడవి వెంకటగిరి జరీచీరె, కుంకుమభరిణ తీసుకువెళ్ళింది. ఇచ్చేవరకు గద్దించి భయపెట్టటమాయెను! ఇప్పటి వరకూ నేను ఎందుకు అట్లా ఇచ్చానా అని నాలో నేనే తర్కించుకుంటాను. అక్కడే-ఆ తలుపుమూలే- రెండు చేతి కర్రలున్నాయి. నేనయినా బలహీనుణ్ణి కాదుగదా. దాన్ని ఎదిరించగల ఉపాయాలు సాధనాలు ఉండి కూడా ఏమి గతి పట్టిందని ఆలోచిస్తున్నాను” అన్నాడు.

ఇది విని కార్యదర్శి అన్నాడు. “వాళ్ళ దగ్గర ఏదో కనికట్టు ఉంటుందండీ. ఒక విధంగా మెస్మరిజమ్ అనుకోవాలి మనము. తెనాలిలో మా బావమరిది బుట్ట లల్లుతూ వచ్చిన ముష్టిదాని వెంబడి నాలుగుమైళ్లు నడుచుకుంటూవెళ్లి, గుడిపె ముందరగా ఒక మంచముమీద కూర్చున్నాడు. ఎంతమందివెళ్లి రమ్మన్నా కదల లేదు. పంపమంటే, ‘వస్తే తీసుకెళ్లండి’ అంటుంది. చివరకు దాని చేతిలో అయిదు రూపాయలు పెట్టేసరికి, ‘వెళ్లవయ్యా వెళ్లు మీవాళ్లు వచ్చారు’ అని అన గానే మావెంట వచ్చాడు. ‘ఏమిటో వెళ్దామనిపించింది దాని వెంబడి’ అంటాడు. తరువాత అడిగితే” అని తన అనుభవము చెప్పాడు కార్యదర్శి.

రాత్రి తొమ్మిదయింది. అంతా లేచారు ఇళ్ళకు వెళ్ళటానికి. వెంకట్రావు సైకిలు మీద ఇంటికి వెళ్ళటానికి త్రోవతీసాడు. రెసిడెన్సీ కోఠీ గల్లీలో-ఆ చీకట్లో వెంకట్రావుకు ఏవో మాటలు వినబడినాయి.

"మన సంపాదన బాగానే ఉంది కదూ సత్తీ. ఈ వారంలో ఒక వెండి పళ్లెము, ఒక జరీచీరె, ధోవతి. పళ్లెము ఇంకో ఊరు వెళ్లాక అమ్మివేద్దాము. చీర నీవు కట్టుకో-ధోవతి నేను కట్టుకుంటాను. ఏం? పెళ్ళయిన తరువాత మనమింత బట్టలు కట్టుకోలేదు కదూ!" అని ఒక గొంతు. "ఎట్లాగయినా ఇంతో అంతో చదువుకున్న తెలివాయెను. ఉద్యోగము చేసినా ఇంత కంటె ఎక్కువ సంపాయిద్దురా" అని ఇంకో గొంతు వినబడింది.

పట్నవాసులందరినీ మోసగిస్తున్న దంపతులు వీళ్ళేనేమోనని వెంకట్రావు సైకిలు వెనక్కు త్రిప్పి మరో గంటకు ఇద్దరు పోలీసులతో వచ్చేసరికి, వాళ్ళ తాలూకు గుడ్డపీలికయినా అక్కడ లేదు.